నమస్తే తెలంగాణ

# కరీంనగర్

5 | కరీంనగర్, మంగళవారం 30 జనవరి 2024 | KARIMNAGAR


## ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్




తొలగించిన ఆటోల సీట్లను చూపుతున్న పోలీసులు

రాంనగర్, జనవరి 29 : కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రయాణికుల భద్రత దృష్ట్యా తీసుకునే ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు బస్టాండ్ ఇన్ గేట్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ మాట్లాడుతూ దాదాపు 100కు పైగా ఆటోల్లో డ్రైవర్ పక్కన అమర్చిన సీట్లను, మ్యూజిక్ సిస్టంలను, ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించేలా అమర్చిన పరికరాలను తొలగించామన్నారు. ప్రతి ఆటో డ్రైవర్‌తోపాటు ఇతర రోడ్డు వాహనదారులు ట్రాఫిక్ నియమాలను విధిగా పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని సూచించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సబ్ ఇన్‌స్పెక్టర్లు రాజు, సాగర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజన్న సన్నిధి.. త్యాగరాజస్వామి పెన్నిధి

### నేటి నుంచే ఆరాధనోత్సవాలు



వేములవాడ టౌన్, జనవరి 29: త్యాగరాజ ఆరాధనోత్సవాలకు వేళయింది. వేములవాడ క్షేత్రంలో 70 ఏండ్లుగా నిర్వహిస్తున్న వేడుకలు, ఈ యేడు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. రాజన్న సన్నిధి ప్రాంగణంలోని ఓపెన్‌స్లాబ్‌పై వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. మంగళవారం ఉదయం 6 గంటలకు స్వస్తి పుణ్యాహవచనంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 7:25 గంటలకు నగర సంకీర్తన, 9గంటలకు జ్యోతి ప్రజ్వలన నిర్వహించనున్నట్లు ఈవో వెల్లడించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో సుప్రసిద్ధ కళాకారులతో శాస్త్రీయ, భక్తి, సంగీత, హరికథ, నృత్య, నాటక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహింపబడుతాయని త్యాగరాజ ఆరాధనోత్సవాల ఇన్‌చార్జి కొంటికర్ల రామయ్య శర్మ తెలిపారు.





## పారితోషికం వెంటనే ఇవ్వండి

### ఆశా కార్యకర్తల డిమాండ్

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 29 : రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పారితోషికాన్ని వెంటనే విడుదల చేయాలని ఆశాకార్యకర్తలు డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్ జిల్లాలోని ఆశా కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ప్రతి వారం ఏఎంసీ టార్గెట్లు విధించడం విరమించుకోవాలని, ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రంగవేణి శారద, ప్రధాన కార్యదర్శి మారెల్ల శ్రీలత, 200 మంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.





## నిధులు విడుదల చేయండి

### విద్యార్థుల డిమాండ్

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 29 : పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, కేజీబీవీల్లో కొంతకాలంగా మెస్‌చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన చెందారు. బిల్లుల చెల్లింపుల్లో ఆలస్యం కావడంతో భోజన నాణ్యతలో తేడా వస్తున్నదని, సరైన పౌష్టికాహారం అందడం లేదని మండిపడ్డారు. బకాయిలు సత్వరమే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. పెరిగిన ధరలకనుగుణంగా కాస్మొటిక్ చార్జీలు చెల్లించాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



## కొండగట్టు అంజన్నకు ₹3.88 కోట్ల ఆదాయం

### 13 దుకాణాల నిర్వహణకు వేలం పాటలు

### గతేడాదితో పోలిస్తే ₹1.14 కోట్లు పెరుగుదల

మల్యాల, జనవరి 29 : కొండగట్టు అంజన్న ఆలయానికి వేలం పాటల్లో భారీ ఆదాయం సమకూరింది. సన్నిధానంలో భక్తులకు అవసరమయ్యే 13 రకాల దుకాణాల నిర్వహణ కోసం బహిరంగ వేలం పాట కం షీల్డ్ టెండర్, ఈ- టెండర్ ప్రక్రియ నిర్వహించగా ₹3.88 కోట్లు వచ్చాయి. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు దుకాణం నిర్వహణకు కరీంనగర్‌లోని దేవాదాయ ధర్మాధాయశాఖ కార్యాలయంలో టెండర్ ప్రక్రియ నిర్వహించినట్టు ఆలయ ఈవో టంకశాల వెంకటేశం, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు. మొత్తంగా ఆలయానికి ₹3,88,41,221 ఆదాయం సమకూరిందని, ఇది ప్రస్తుత ఏడాది ధరలతో పోలిస్తే ₹1,14,70,950 అధికంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తిరుక్కోవెళూర్ మారుతీస్వామీ, ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీనివాసశర్మ, సునీల్, సెక్షన్ ఇన్‌చార్జి ఉమామహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఏయే దుకాణాలకు ఎంతంటే..


- కొబ్బరికాయల విక్రయానికి ₹1.37 కోట్లు
- కిరాణం నిర్వహణకు ₹11 లక్షలు
- పుట్నాలు, ప్యాలాల విక్రయాలకు ₹24.75 లక్షలు
- పూలు, పండ్ల విక్రయాలకు ₹34.50 లక్షలు
- గాజులు, ప్లాస్టిక్ ఆట వస్తువుల విక్రయాలకు ₹27.75 లక్షలు
- భక్తుల పాదరక్షలు భద్రపరిచేందుకు ₹9 లక్షలు
- వంట చెరుకు విక్రయానికి ₹64 వేలు
- హోటల్ నిర్వహణకు ₹14.50 లక్షలు
- కొబ్బరి ముక్కలు సేకరణకు ₹80.20 లక్షలు
- కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీం విక్రయాలకు ₹10.25 లక్షలు
- ఫొటోస్టూడియో నిర్వహణకు ₹14,16,166
- లాకర్ రూం నిర్వహణకు ₹12.40 లక్షలు
- సులభ్ కాంప్లెక్స్ నిర్వహణకు ₹12,25,555

# ఇక 'ప్రత్యేక' పాలన!

### పంచాయతీలకు స్పెషలాఫీసర్లు

### కలెక్టర్ పరిశీలనలో జాబితా

- ఫిబ్రవరి ఒకటితో ముగుస్తున్న సర్పంచుల పదవీ కాలం
- పొడిగించాలని విన్నవిస్తున్నా స్పందించని సర్కారు
- 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం
- నేడో రేపో వెలువడనున్న ఉత్తర్వులు




**గ్రామ పంచాయతీల్లో వచ్చే నెల 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన మొదలు కానున్నది. ఫిబ్రవరి ఒకటితో సర్పంచుల పదవీ కాలం ముగుస్తుండగా, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణ సాధ్యం కాని కారణంగా ప్రభుత్వం స్పెషలాఫీర్ల పాలన తెస్తున్నది. ఓవైపు సర్పంచులు తమ పదవీ కాలాన్ని పొడిగించాలని విన్నవిస్తున్నా స్పందించలేదు. ప్రత్యేకాధికారుల పాలన కోసం యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. 21 క్యాడర్లలో అధికారుల వివరాలను సేకరించిన ఎంపీడీవోలు కలెక్టర్‌కు ప్రతిపాదన పంపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడో రేపో ప్రత్యేక జాబితాను విడుదల చేయనున్నారు.**

కరీంనగర్, జనవరి 29 (నమస్తే తెలంగాణ) : పంచాయతీల్లో ప్రస్తుతం ఎన్నికల నిర్వహణ సాధ్యపడని కారణంగా ప్రభుత్వం స్పెషలాఫీర్లను నియమిస్తున్నది. 2018లోనూ ఇదే విధంగా నియమించింది. ఆ ఏడాది ఆగస్టు 2 నుంచి 2019 ఫిబ్రవరి 2 వరకు అంటే.. కొత్తగా ఎన్నికైన సర్పంచులు ప్రమాణ స్వీకారం చేసే వరకు సుమారు 6 నెలలపాటు ప్రత్యేకాధికారుల పాలన సాగింది. అప్పట్లో అంటే.. 2019 జనవరి 21న మొదటి, 25న రెండో, 30న మూడో విడుతలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 2న ప్రమాణ స్వీకార ప్రక్రియ కొనసాగింది. దీంతో సర్పంచుల పదవీ కాలం వచ్చే ఫిబ్రవరి 1న ముగుస్తుంది. దీంతో ప్రభుత్వం 2వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన తేబోతున్నది. అందుకు జిల్లాల వారీగా అధికారులు పూర్తి స్థాయిలో కసరత్తు చేశారు. సర్పంచుల కాల పరిమితి తీరిన వెంటనే ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టనున్నారు. అయితే ఈ నేపథ్యంలో సర్పంచులంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పదవీ కాలాన్ని జూన్ వరకు పొడిగించాలని, తనకే పూర్తి అధికారాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఫిబ్రవరి రెండులోగా పంచాయతీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



#### జాబితాలు రెడీ

ప్రత్యేకాధికారుల జాబితాను ఆయా మండలాల ఎంపీడీవోలు సిద్ధం చేసి కలెక్టర్ ఆమోదం కోసం పంపించారు. మొత్తం 21 కేటగిరీల్లోని అధికారులను పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా ఎంపిక చేశారు. మండల స్థాయిలో వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న అధికారుల్లో ఎంపీడీవోలు, ఎంపీవోలు, మండల పరిషత్తు సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పశువైద్యాధికారులు, పంచాయతీరాజ్ ఏఈలు, మిషన్ భగీరథ ఏఈలు, ఎంఈవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, అవసరమైన చోట వాడుకునేందుకు గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్లు, టైపిస్టులు, తదితర కేటగిరీల్లోని ఉద్యోగులను కూడా తీసుకుంటున్నారు. మండలాల వారీగా ఎంపీడీవోల నుంచి జాబితా రాగా.. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ఎక్కువ గ్రామాలున్న గంగాధర, మానకొండూర్ మండలాలకు కింది స్థాయి ఉద్యోగులను కూడా ఎంపిక చేసినట్టు కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి పంచాయతీ అధికారి పవన్‌కుమార్ తెలిపారు. అయితే ప్రత్యేకాధికారుల జాబితా నేడో రేపో అధికారికంగా వెలువడే అవకాశాలు ఉండగా.. ఏ గ్రామానికి ఏ అధికారిని నియమిస్తున్నారనే చర్చ అన్ని గ్రామాల్లో నడుస్తున్నది. ఇప్పటికే గ్రామాల వారీగా కొంత మంది ప్రత్యేకాధికారుల పేర్లు వినిపిస్తుండగా, అంతటా ఆసక్తి కర చర్చ సాగుతున్నది.



మంత్రి పొన్నంను సన్మానించి వినతి పత్రం అందిస్తున్న సర్పంచులు

## ఎన్నికల వరకే రాజకీయాలు

### మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, జనవరి 29 : ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలని, ఎన్నికల తర్వాత అందరూ అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సోమవారం సైదాపూర్ మండలంలోని ఆరెపల్లిలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించడంతో పాటు గుజ్జుల పల్లిలో రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను హైదరాబాద్‌కు ఇన్‌చార్జి మంత్రినే అయినా, హుస్నాబాద్‌కు ఎమ్మెల్యేనని చెప్పారు. తనను గెలిపించిన నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు ఫోన్‌చేసి అభివృద్ధికి సహకరించాలని కోరానన్నారు. తనది తెలంగాణ కోసం పోరాడిన చరిత్ర అని, రాజకీయంగా అంచెలంచెలుగా ఎదిగానని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మండ ల సర్పంచులు తమ బిల్లుల విషయమై వినతిపత్రం ఇవ్వగా, బిల్లులు న్యాయపరంగా ఉంటే ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్మన్ పేరాల గోపాలరావు, ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, వెన్నంపల్లి సింగిల్‌విండో చైర్మన్ బిల్ల వెంకటరెడ్డి, సర్పంచ్ ఆవునూరి పాపయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## డీఏవో శ్రీధర్ బదిలీ

- టీఎస్ ఆయిల్ ఫెడ్ ఓఎస్డీగా కీలక బాధ్యతలు
- ఏడేళ్ల పాటు సుదీర్ఘ సేవలు
- కొత్త డీఏవోగా ప్రియదర్శిని

కరీంనగర్, జనవరి 29 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్ బదిలీ అయ్యారు. తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఓఎస్డీగా ప్రభుత్వం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించింది. సోమవారం హైదరాబాద్‌లోని ఆయిల్ ఫెడ్‌లో శ్రీధర్ ఈ బాధ్యతలు స్వీకరించారు. 2017 జనవరి 30న జిల్లా వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపట్టిన వాసిరెడ్డి శ్రీధర్, ఏడేళ్ల సుదీర్ఘ సేవలను అందించారు. రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలను కేసీఆర్ ప్రభుత్వం జిల్లాలోనే ప్రారంభించగా, ఆ కార్యక్రమాలను విజయవంతం చేశారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కూడా రైతులకు అందించడంలో కీలకంగా వ్యవహరించారు. దళిత బంధు పథకం అమలు చేయడంలో కూడా కీలక అధికారిగా బాధ్యతలు నిర్వహించారు. జిల్లా రైతులకు పలు ప్రత్యేక సేవలు కూడా అందించారు. ముఖ్యంగా పంటలపై ఆశించే తెగుళ్లు, రోగాలను నిర్ధారించేందుకు ఈ- సాయం పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకుని రైతులకు మంచి సేవలు అందించారు. ఈయన సేవలను గుర్తించిన ప్రభుత్వం ఇజ్రాయెల్, చైనా దేశాల పర్యటనలకు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో పంపించి అక్కడి వ్యవసాయ విధానాలను అధ్యయనం చేయించింది. జిల్లా అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఉన్న శ్రీధర్ అధికారుల మన్ననలు అందుకున్నారు.



వాసిరెడ్డి శ్రీధర్

#### ప్రియదర్శిని బాధ్యతల స్వీకరణ

జిల్లా వ్యవసాయ అధికారి బదిలీ కావడంతో ఆత్మ పీడీగా విధులు నిర్వహిస్తున్న ప్రియదర్శినికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. సోమవారం ఈమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భగా ప్రియదర్శినిని కార్యాలయ సిబ్బం ది అభినందించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రణధీర్ కుమార్, ఏడీఏ (ట్రైనింగ్) అంజనీ, సాంకేతిక వ్యవసాయ అధికారులు ఎం కృష్ణ, కే స్వప్న, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జ్యోతి, కరీంనగర్, కొత్తపల్లి మండల వ్యవసాయ అధికారులు సత్యం, రంజిత్ పాల్గొన్నారు.



ప్రియదర్శిని

## తప్పుడు కేసులు పెడితే ఊరుకోం

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల టౌన్, జనవరి 29 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను కక్షపూరితంగా ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మండిపడ్డారు. తప్పుడు కేసులు పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. జాబితాపూర్, హబ్సీపూర్ సర్పంచ్‌లు, జడ్పీ చైర్‌పర్సన్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ అనుబంధ నాయకులపై విజిలెన్స్ ఎంక్వైరీ చేయించడం బాధాకరమన్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి జాబితాపూర్ సర్పంచ్‌ను సస్పెండ్ చేయిస్తే కోర్టు నుంచి స్టే తీసుకొచ్చినట్టు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ సర్పంచులు ఉన్న చోట్ల సైతం అభివృద్ధికి సహకరించామని, వారు చేసిన పనులపై ఏనాడూ ఎంక్వైరీ చేయించకుండా బిల్లులు ఇప్పించామని గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు సంబంధించిన అల్లీపూర్ సర్పంచ్‌కు ఉత్తమ సర్పంచ్ అవార్డు అందించామన్నారు. రాజకీయ కక్ష పూరితవైఖరి అవలంభించడం జీవన్‌రెడ్డి స్థాయికి సరికాదని హితవుపలికారు. బెల్ట్ షాపులు, మద్యం పాలసీపై గతంలో విమర్శించిన ఆయన 60 రోజుల్లో ఎన్ని బెల్టు షాపులు మూసివేయించారో? కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్యంపై ఎంత ఆదాయం తగ్గిందో చెప్పాలని డిమాండ్ చేశారు. 420 హామీలు ఇచ్చి 6 గ్యారెంటీలపైనే మాట్లాడుతున్నారని, 420 హామీలను ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలుపాలని డిమాండ్ చేశారు. 2023 డిసెంబర్ 9 నాటికి ₹2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ కనీసం 2024 డిసెంబరులోపైనా పూర్తి చేస్తుందా..? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పదే పదే మాట్లాడుతున్న ప్రభుత్వం, దెబ్బతిన్న పనులు చేయించకపోవడంతో రోజుకు 6 వేల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతుందని, దీనికి ఆ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జగిత్యాల నియోజకవర్గ చిట్ట చివరి గ్రామాలైన తాళ్లధర్మారం, చిత్రవేణిగూడెం, బట్టపెల్లిపోతారం, చింతలూరులో ఒక్క ఎకరం ఎండకుండా ఎస్సారెస్పీ నీటిని ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వంలో సాగుకు నీళ్లు ఎలా వచ్చాయో? ఇప్పుడు ఎందుకు రావడం లేదో రైతులు గ్రహిస్తున్నారన్నారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ.. జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శించడం హాస్యాస్పదమని మండిపడ్డారు. తగినన్ని బస్సులు లేక సీట్లు దొరకక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, మరోవైపు ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. బస్సులు పెంచి అన్ని గ్రామాలకు నడపడం వల్ల మహిళలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. సరైన సమయంలో రాక బస్సు స్టాప్‌ల వద్ద విద్యార్థులు నిరీక్షిస్తున్నారని, వచ్చిన బస్సుల్లో కెపాసిటీకి మించి జనం ఎక్కడంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సమావేశంలో పార్టీ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, ఎంపీపీ రాజేంద్రప్రసాద్, సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు అంకం సతీశ్, అంకతి మల్లయ్య, వీరబత్తిని శ్రీనివాస్, సుమన్ రావు, పట్టణ యూత్ అధ్యక్షులు కత్రోజ్ గిరి, శరత్‌రావు, రాజు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## ఎంపీగా బండి అట్టర్ ఫ్లాప్

- ఏదిపడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదు
- ఐదేండ్లలో ఏం చేశావో చెప్పు
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజం

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 29 : కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా తీసుకురాకుండా అట్టర్ ఫ్లాప్ అయ్యారని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజమెత్తారు. కరీంనగర్‌లోని 37వ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోతానన్న భయం సంజయ్‌లో మొదలైందని, అందుకే మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌పై ఇష్టంవచ్చినట్లుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వాస్తవాలు తెలుసుకోవాలని హితవుపలికారు. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్, జగిత్యాల నుంచి వరంగల్ జాతీయ రహదారి, ఎల్కతుర్తి, సిద్దిపేట జాతీయ రహదారి ఎవరు తెచ్చారో, కరీంనగర్ స్మార్ట్ సిటీ ఎలా వచ్చిందో? చెప్పాలని నిలదీశారు. ఐదేళ్లలో కేంద్రం నుంచి ఒక్క ప్రాజెక్టు తీసుకురాని దద్దమ్మ బండి సంజయ్‌కి వినోద్‌కుమార్‌ను విమర్శించే అర్హత లేదని హితవుపలికారు. పెద్ద హిందువునని చెప్పుకునే బండి సంజయ్ వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంటలోని ఆలయాల అభివృద్ధికి ఎందుకు నిధులు తీసుకురాలేదని ప్రశ్నించారు. అది చేతగాదు గానీ, మతం పేరుతో మాత్రం యువతను రెచ్చగొట్టి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తారని మండిపడ్డారు. కేసీఆర్ ఎన్ని యాగాలు, పూజలు చేశారో ప్రపంచమంతా తెలుసునని, యాదాద్రి వంటి మహాక్షేత్రాన్ని నిర్మించిన ఘనత కేసీఆర్‌దని స్పష్టం చేశారు. అలాంటి వారిని పట్టుకొని నాస్తికులు అని అనడం సంజయ్ అవివేకమని, అసలు నాస్తికులు అని ఎవరిని అంటారో ఆయనకు తెలుసా అని ప్రశ్నించారు. గంగుల కమలాకర్, వినోద్ కుమార్ కృషితో కరీంనగర్‌కు టీటీడీ దేవాలయం వచ్చిందని, ఇది తెలుసుకోకుండా సిగ్గులేకుండా విమర్శలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. ఐదేళ్లలో ఎంపీగా ఎన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా బట్టేబాజ్ మాటలు మానుకోవాలని హితవు పలికారు. బీజేపీ అంటే అబద్ధాలు, అసత్య ప్రచారాలని ధ్వజమెత్తారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, నాయకులు చంద్రశేఖర్, ఆరే రవి, సత్తినేని శ్రీనివాస్, వొడ్నాల రాజు పాల్గొన్నారు.